క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రాజంపేట సబ్ కలెక్టర్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శనివారం సాయంత్రం రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఉన్న కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవిని అభినందించారు. రాజంపేట డివిజన్ అభివృద్ధికి కృషి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

రేపు మండల మీట్

రామాపురం : ఈనెల 29న సోమవారం జరగనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో పలు సమస్యలపై సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు, గ్రామస్థాయి అధికారులందరూ ఆయా శాఖల వారీగా నివేదికలను తీసుకురావాలని కోరారు.

29న వీరబల్లెలో..

వీరబల్లి : ఈనెల 29వ తేదీ సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరుగునని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిలు పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ మెంబర్లు హాజరుకావాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణ శివార్లలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.విశ్వనాథనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీనేతలతో కలసి ఆయన శనివారం సుండుపల్లె మార్గంలో నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి లబ్ధిదారులకు అందివ్వని పక్షంలో తాము ఉద్యమిస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్రనేత శంకర్‌నాయక్, గిరిజన సమాఖ్య నేతలు దేవరాజ్, రామాంజనేయులతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై కళాజాత



రాజంపేటలో కళాజాత దృశ్యం

రాజంపేట : పట్టణంలో పర్యావరణ కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం కళాజాత నిర్వహించారు. నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ జాత కొనసాగింది. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టితో చేసిన వినాయకుడినే పూజించాలని కళాకారులు గేయాల రూపంలో వినిపించారు. ఈ సందర్భంగా కమిషనరు రాంబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.శ్రీనువాసులు, ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు అర్బన్ : ఆశ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పెండింగ్ అలవెన్సులు, కనీస వేతనం, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించడం, అలాగే సాధారణ సెలవులు, మెటర్నటీ సెలవులివ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

గాలివీడు : బ్రాహ్మణ వీధిలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆనందాచార్యులు స్వామి వారిని అలంకరించారు. శ్రావణ మాసంలో ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



సుండుపల్లె: ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి



రాజంపేట రూరల్: ఆకేపాటికి సమస్యను తెలియజేస్తున్న నాగిరెడ్డిపల్లి నాయకులు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దనేని కాలువ గ్రామ పంచాయతీలోని మాన్యంవారిపల్లిలో ఇటివలే బర్డ్స్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకొని వచ్చిన కొమ్ముూరి చిన్నపురెడ్డిని వారి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అజయ్ రెడ్డి, రామస్వామి రెడ్డి, ఆరంరెడ్డి, రెహమాన్ ఖాన్, సుండుపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ, చెరువువాండ్లపల్లెలో మాజీ సర్పంచ్ పసుపులేటి ఆంజనేయులు మృతదేహానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నివాళులర్పించి మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తదనంతరం గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులకు ఏ సమస్యలు వచ్చినా తమకు తెలియపరిస్తే వెంటనే ఆ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అంజయ్ రెడ్డి, రామస్వామి రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆరం రెడ్డి, రెహమాన్ ఖాన్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాన్ని మార్చండి

రాజంపేట రూరల్ : నాగిరెడ్డిపల్లి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సచివాలయం - 2ను సచివాలయం - 3 వద్దకు మార్చాలని అక్కడి వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని కోరారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు శుక్రవారం నందలూరు మండలంలోని మేజర్ పంచాయతీ నాగిరెడ్డిపల్లి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విచ్చేసి ఈ మేరకు ఎమ్మెల్యే ఆకేపాటికి వినతిపత్రం అందజేశారు. ఇప్పుడు ఉన్న సచివాలయం-2 నాగిరెడ్డిపల్లికి దూరంగా తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉందన్నారు. ప్రతి నిత్యం నాగిరెడ్డిపల్లి ప్రజలు అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఆ సచివాలయాన్ని ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయం - 3లో కొనసాగించినా అక్కడి ప్రజలకు అనువుగా ఉంటుందన్నారు. తక్షణమే సచివాలయాన్ని మార్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆకేపాటి వారికి భరోసా ఇచ్చారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి జగదీశ్వరరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, వార్డు మెంబర్లు దుర్గయ్య, ఆదినారాయణ, గిరీష్‌కృష్ణ, నాగేశ్వర రెడ్డి, నరసింహారెడ్డి, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటి

రాజంపేట : రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నూతనంగా బాధ్యతలు తీసుకున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవితో శుక్రవారం భేటి అయ్యారు. సబ్‌కలెక్టర్ చాంబరులో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి, సమస్యలు తదితర అంశాలపై సబ్‌కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ఈయన వెంట రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ నేతలు గుండు మల్లికార్జునరెడ్డి, దాసరి పెంచలయ్య, శివారెడ్డి, గోవిందు బాలకృష్ణ, మారుతీ పాల్గొన్నారు.

ఏపీఎండీసీ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, మంగంపేట ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీ బెరైటీస్ డిస్పాచ్ అమ్మకాలు ప్రారంభించి సంస్థ మీద ఆధారపడి జీవిస్తున్న 20వేలు మంది కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అలాగే అన్ని గనులలో ఇస్తున్న వేతనాలు ఇక్కడి కార్మికులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సుండుపల్లె : మండల కేంద్రం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ ఇందిరా నగర్ జనార్దన్ రెడ్డి నగర్ ఆరెమ్మ దేవాలయంతోపాటు పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసే పైపులైన్‌లో వేర్లు వెళ్లి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయని ఉన్నాయని ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు తెలిపారు. సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శనివారం ఉదయం నుండి పైప్‌లైన్ అక్కడక్కడ తవ్వి దెబ్బతిన్నచోట నూతన పైపులను వేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామన్నారు.

పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపండి



రైతులకు దరఖాస్తులను అందజేస్తున్న అధికారులు

సిద్ధవటం : రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శనివారం ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీలో పండ్లతోటలు, న్యూట్రీ గార్డెన్స్, సంపద సృష్టి కేంద్రాలు సీసీఆర్‌సీ కార్డులు, పి.ఎం. కిసాన్ వెరిఫికేషన్ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించామన్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైమరీ సెక్టార్ మీటింగ్‌లో వారి సూచనలు, సలహాల మేరకు మండల స్థాయి కన్వర్జెన్స్ మీటింగ్‌ను జరిపామన్నారు. ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ, సంక్షేమ వసతి గృహాల్లో న్యూట్రీ గార్డెన్స్ (పెరటి తోటలు) ఏర్పాటు చేయాలన్నారు. అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం పండ్ల తోటల పెంపకానికి సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి విలియంరాజు, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఉపాధి ఏపీఓ నరసింహులు, ఉద్యానశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లక్ష్మినరసయ్య, పంచాయతీ కార్యదర్శులు, రైతు సేవా కేంద్రం సహాయకులు, ఉపాధి హామీ టెక్నిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న

సిద్ధవటం : విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సిద్ధవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు క్రమశిక్షణపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పెద్ద ఓబన్న మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీరు ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాలలకు పంపిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. చదువుకుంటే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి అంకితభావంతో పట్టుదలతో చదువుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులకు తెలియకుండా పాఠశాల నుంచి ఎవరూ ఎక్కడికీ వెళ్లకూడదని విద్యార్థులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా ఆలయానికి చేరిన విగ్రహాలు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నెల్లూరుకు చెందిన చిన్నారుల భజన కార్యక్రమం

పెనగలూరు : కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించేందుకు ప్రత్యేకంగా తీసుకువస్తున్న వినాయకస్వామి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను హైస్కూల్ నుంచి కొత్తపల్లి వరకు భారీ ఊరేగింపుతో ఆలయానికి తీసుకువచ్చారు. వినాయక విగ్రహంతోపాటు ఉత్సవ విగ్రహాలు, ద్వార పాలకులు, మకరతోరణం, కలశను తీసుకువచ్చారు. నెల్లూరు నుంచి ప్రత్యేకంగా వచ్చిన చిన్నపిల్లల భజన బృందం ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీగా బాణాసంచాలు పేల్చుతూ మేళతాళాలు వాయిస్తూ విగ్రహాలను ఊరేగించారు.

ఆదర్శప్రాయుడు ఏపీజే అబ్దుల్ కలాం



పెనగలూరు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో..



రాజంపేట టౌన్: మొక్కలు నాటుతున్న దృశ్యం



రాయచోటి అర్బన్: అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

రాయచోటి అర్బన్ : అందరికి ఆదర్శపాయుడు, దేశం గర్వించదగిన గొప్ప శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి చైర్మన్, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలు గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక టీచర్‌గా, సైంటిస్ట్‌గా, ఒక రాష్ట్రపతిగా, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా అబ్దుల్ కలాంను ఎటు చూసినా అందరికీ ఆదర్శప్రాయుడిగా కనిపిస్తారన్నారు. 1998లో దేశంలో నిర్వహించిన అణు పరీక్షలలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. 2020 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో సహా అనేక ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు అందుకున్న వ్యక్తి అంటూ కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అల్తాఫ్, గౌస్‌ఖాన్, ఈశ్వర్, వైఎస్ఆర్‌సీపీ నేతలు సయ్యద్ షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్‌కుమార్, రియాజ్, జానం రవీంద్ర, జావేద్, ఖలీల్ బేగ్, జుబేర్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన మేధావి అబ్దుల్ కలాం

రాజంపేట టౌన్ : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రపంచం మెచ్చిన గొప్ప మేధావి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో శనివారం కలాం వర్ధంతిని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అణు, శాస్త్రీయ రంగాలకు సరికొత్త మార్గనిర్దేశం చేసిన దార్శనికుడు, యువతకు స్ఫూర్తి ప్రదాత కలాం అని కొనియాడారు. తన జీవితంలో సంపాదించిన సంపాదన మొత్తం తాను దత్తత తీసుకున్న గ్రామానికే ఖర్చు చేసిన గొప్ప మానవతావాది అని తెలిపారు. కలలు కనండి సాకారం చేసుకోండి అన్న కలాం పిలుపును ప్రతి ఒక్కరు నిజం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, సంఘ సేవకుడు షేక్ అబ్దుల్లా, ఉపాధ్యాయులు రమణయ్య, బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, టి.హరిప్రసాద్, శ్రీనివాసులు, పి.సూర్యచంద్ర, పత్తిపాటి నవీన్‌కుమార్, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : మిస్సైల్ మ్యాన్‌గా పేరు గాడించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంకు పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా నివాళులర్పించారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బీర్ అహ్మద్ సహకారంతో హైస్కూల్‌లో కలాం చిత్రపటానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ మండల జనరల్ సెక్రటరీ కోనేటి రెడ్డి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, కోడూరు అసెంబ్లీ కన్వీనర్ చెంగల్ రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సునీత, నారాయణవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల, నాయకులు కోనేటి నరసింహులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న లింగం సంజీవ్

రాజంపేట రూరల్ : మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తనను నియమించినట్లు రాజంపేటకు చెందిన లింగం సంజీవ్ శనివారం విలేకరులకు తెలిపారు. తిరుపతిలో ఇటీవల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుధాకర్ తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని చెప్పారు. అదే విధంగా తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. దళితుల సమస్యల పరిష్కారంలో తాను అహర్నిశలు కృషి చేసి పెద్దల నమ్మకాన్ని నిలబెడతానన్నారు. తనకు ఈ పదవి కేటాయించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గురువును పూజించడం మన ధర్మం

రాయచోటి టౌన్ : గురువును పూజించడం మన ధర్మం.. మన భారతీయ సంప్రదాయమని డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా శనివారం ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో రాయచోటి ప్రతిభ కళాశాలలో గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని గురువులు పూజించిన చోట విజ్ఞానం విరాజిల్లుతుందన్నారు. సమాజంలో గురుస్థానం చాలా గొప్పదని, విద్యార్థికి తన విజ్ఞానన్నంతటనీ వడపోసి ఉత్తమ వ్యక్తిగా తీర్చిదిద్దేది గురువు ఒక్కడేనన్నారు. వేదల కాలం నుంచి గురువును పూజించే సంప్రదాయం మన దేశంలోనే ఉందని, ఆ సంప్రదాయాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని ఆపస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు అన్నారు. కార్యక్రమంలో ఆపస్ గౌరవాధ్యక్షులు పరుశురాం, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.నాగేశ్వరావు, కళాశాల అధ్యాపకులు వెంకటరమణ, ఏపీఎస్ఆర్‌డబ్ల్యూ గ్యారంపల్లె ప్రిన్సిపల్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పంటగా ప్రకృతి సేద్యం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొజ్జవారిపల్లి గ్రామంలోని యానాదయ్య మామిడితోటలో అంతర్ పంటగా ప్రకృతి సేద్యంపై శనివారం ప్రకృతి సేద్య ప్రాజెక్టు రీసోర్స్ పర్సన్ ఉషారాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలలో ప్రకృతి సేద్యంగా బొప్పాయి, సంపంగి, దోస, టమాటా వంటి పంటలు పండించుకుంటే మంచి దిగుబడి.. ఆదాయం వస్తుందన్నారు. రైతులు ప్రకృతి సేద్యం చేస్తే మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో తిరుమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



సంబేపల్లె: మొక్కలు నాటుతున్న విద్యార్థులు



సుండుపల్లె: మొక్కలు నాటుతున్న సిబ్బంది

సంబేపల్లె : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి అన్నారు. సంబేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహనతో జీవించడానికి ఏర్పడ్డ మిషన్ లైఫ్ కోసం పాఠశాలలో నీరు, వ్యర్థాల నిర్వహణ, శక్తి, భూమి, గాలి, ఆహారం వంటి ఆరు రకాల ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క అనే నినాదంతో తమ తల్లులతో కలిసి విద్యార్థులు మొక్కలు నాటారన్నారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలను, వృక్షాలను తీగ జాతులను విద్యార్థులతో లెక్కింపజేసి వాటిని వచ్చే సంవత్సరానికి రెండింతలు చేస్తామంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. భూ మండలంపై పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అందువలన విద్యార్థులతో మొక్కల చుట్టూ శుభ్రం చేయించి, పాదులు తీసి నీటిని పోయించామన్నారు. మైదానంలో ఉన్న చెట్లకు వాడుక భాషలో ఉన్న పేరుతో పాటు వాటి శాస్త్రీయ నామాలను బోర్డుపై రాయించి సంబంధిత ప్రతి చెట్టుకు వేలాడదీయడం జరిగిందన్నారు. విభిన్న ఆకారాలలో ఉన్న పత్రాలను సేకరించి వాటికి రంగులు పూసి విద్యార్థులతో ప్రదర్శన చేయించడం జరిగిందన్నారు. అనంతరం ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన పాటలను విద్యార్థులతో పాడించడమే కాకుండా చెట్ల పరిరక్షణపై కొన్ని నాటికలను వారితో వేయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శంకరయ్య, రెడ్డయ్యరెడ్డి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ చెట్లను పెంచడం ద్వారా వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు, హెడ్‌మాస్టర్ జయన్న, ఎంఈఓ రవీంద్ర నాయక్, పీఈటీ రవీంద్రరాజు, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాసులు, పద్మావతి, ఎన్డీఏ కూటమి నేతలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

లక్కిరెడ్డిపల్లె : ఉప రెవెన్యూ కార్యాలయం పరిధిలోని లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు నేడు ఆదివారం విద్యుత్ చార్జీల వసూళ్ల కేంద్రాలు (కౌంటర్లు) యథావిధిగా పనిచేస్తాయని జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులను కౌంటర్‌లలో చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన తెలియజేశారు.

దివ్యాంగులకు స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

లక్కిరెడ్డిపల్లె : దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలని లక్కిరెడ్డిపల్లి మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కాలువ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం మా శరీరానికే కానీ మనస్సుకు కాదని, భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 41లో పేర్కొన్నట్లు దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం దోహదం చేయాలన్నారు. పరిపాలనలో ఉన్న ఐఏఎస్ ఆఫీసర్ ఈ విధంగా కించపరుస్తూ మాట్లాడటం శోచనీయమన్నారు. స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన తెలిపారు.